స్పందించారు.. తొలగించారు


చెట్ల కొమ్మలు తొలగించి తీసుకెళ్తున్న కార్పొరేషన్ సిబ్బంది

సాక్షి స్పందన

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని పాతమంచిర్యాలలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను ఇటీవల విద్యుత్‌శాఖ అధికారులు కొట్టేసి, ఇళ్ల ముందు, రోడ్డు పక్కన కుప్పలుగా పడేసి అలాగే వదిలేశారు. దీనిపై ఈ నెల 7న 'సాక్షి'లో 'కొమ్మలు కొట్టారు.. అక్కడే వదిలారు' అనే శీర్షికన వచ్చిన కథనానికి కార్పొరేషన్ అధికారులు స్పందించారు. మంగళవారం చెట్ల కొమ్మలన్నింటినీ తొలగించారు. ట్రాక్టర్ల ద్వారా డంపింగ్‌యార్డుకు తరలించడంతో, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి పలువురు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్టీసీ బస్టాండా.. క్యాంటీనా?



మందమర్రిరూరల్: మందమర్రి మార్కెట్ ఏరియాలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌పై ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్‌లోకి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో రద్దీ తక్కువగా ఉండడమే కాకుండా ఆదాయం కూడా లేదు. ఖాళీగా ఉంటుందనే ఉద్దేశంతో ఓ నాయకుడు ఆర్టీసీ అధికారుల వద్ద క్యాంటీన్ పెట్టుకోవడానికి కొన్ని నెలల క్రితం అద్దెకు తీసుకున్నాడు. ఆర్టీసీ బస్టాండ్ పేరు ఉన్న చోట క్యాంటీన్ పేరున ఫ్లెక్సీ పెట్టాడు. దీంతో ఆర్టీసీ బస్టాండ్ పేరు ఎక్కడా కనిపించకపోవడంతో అసలు ఆర్టీసీ బస్టాండా..? లేక క్యాంటీనా..? అనే సందేహం ప్రజల్లో కలుగుతోంది. ఈ విషయమై ఆర్టీసీ మంచిర్యాల డిపో మేనేజర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఇప్పటికే క్యాంటీన్ నిర్వాహకుడికి మూడుసార్లు ఫ్లెక్సీ తొలగించాలని చెప్పినట్లు, అతడు రెండు మూడు రోజుల్లో తీయకుంటే తానే వచ్చి తీపిస్తానని చెప్పారు.

బురద ఇలా.. బడిలోకి వెళ్లేదెలా..?



రేచిని రోడ్డు పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

తాండూర్: పాఠశాలకు వెళ్లి చదువుకోవాలన్న.. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి పౌష్టికాహారం తీసుకోవాలన్న.. బురద నీటిని దాటాల్సిందే. మండలంలోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న రేచిని రోడ్డు మండల ప్రాథమిక పాఠశాల ఆవరణలోనే ప్రభుత్వ పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రం కూడా ఉన్నాయి. చిన్న వర్షం పడితే చాలు ఈ ఆవరణ అంతా జలమయం అవుతుంది. ఇటు పాఠశాలకు వెళ్లాలన్న...అటు అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకోవాలన్నా చిన్నారులు ఈ బురద నీటిని దాటాల్సిందే. కనీసం అధికారులు, ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లేందుకు తాత్కాలికంగా ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడం శోచనీయం. ఇప్పటికైనా మండల అధికారులు పాఠశాల ఆవరణ దుస్థితిపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్లుప్తంగా

స్ట్రాంగ్ రూం పరిశీలన


కళాశాలలో పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో

లక్సెట్టిపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎన్నికల స్ట్రాంగ్ రూం కోసం జెడ్పీ సీఈవో గణపతి మంగళవారం పరిశీలించారు. రాబోవు జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానిక ఎన్నికల నిర్వహణ స్ట్రాంగ్‌రూం కోసం భవనం అనుకూలంగా ఉంటుందని పరిశీలించినట్లు తెలిపారు. ఎన్నికలు ముగిసిన తర్వాత లెక్కింపు కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అనంతరం కళాశాలలోని గదులను, పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, దండేపల్లి ఎంపీడీవో ప్రసాద్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

'పొన్నం' క్షమాపణ చెప్పాలి

శ్రీరాంపూర్: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను అవమానించిన మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే క్షమాపణ చెప్పాలని సింగరేణి మాదిగ ఉద్యోగుల సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు నెలబోయిన కుమార్, కేంద్ర కమిటీ నాయకులు రాజేంద్రప్రసాద్, సురేశ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన లక్ష్మణ్‌ను అవమానించడం తగదన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే పెద్ద యెత్తున ఆందోళనలు చేస్తామన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

లక్సెట్టిపేట: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. న్యాయమూర్తిపై దాడి చేయడం చాలా దారుణమని, ఇలాంటి సంఘటనలు మరల పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, కమిటీ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు విద్యుత్‌స్తంభం ధ్వంసం

వేమనపల్లి: మండలకేంద్రంలోని బొగుడగూడెం ప్రాణహిత లైన్‌పై రెండు రోజుల క్రితం పిడుగు పడి, చంద్రారెడ్డి ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోని 11కేవీ విద్యుత్ స్తంభం ధ్వంసం అయింది. విద్యుత్ తీగలు పత్తి పైరుపై పడి మంటలు లేచాయి. మంగళవారం పత్తి చేనులోకి వెళ్లిన రైతులు గమనించి విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. లైన్ ఇన్‌స్పెక్టర్ మార్కండేయ సూచనతో సిబ్బంది రాకేశ్, మహేష్ ఘటనా స్థలానికి వెళ్లి విద్యుత్ లైన్ సరిచేశారు.

'ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేద్దాం'

జన్నారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో జన్నారం మండలంలో గులాబీ జెండా ఎగురవేద్దామని బీఆర్‌ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరగా, వారిని గులాబీ కండువా కప్పి జాన్సన్‌నాయక్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ముందుకెళ్లి ఓట్లు అడిగే పరిస్థితి లేదని, ఒక యూరియా బస్తా ఇవ్వని కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేసి జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ జక్కు భూమేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్దన్, మాజీ కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్ పాల్గొన్నారు.

క్వార్టర్లు కూలుతున్నయ్!


ప్రహరీ కూలిపోయిన ఆర్కే 8 కాలనీలోని క్వార్టర్

- శిథిలావస్థకు చేరినా మరమ్మతులో జాప్యం
- సివిల్, ఎలక్ట్రికల్ పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం
- నెలల తరబడి నిరీక్షణ
- ఇబ్బంది పడుతున్న కార్మికులు

శ్రీరాంపూర్: సింగరేణి క్వార్టర్ల మరమ్మతులో అధికారులు జాప్యం చేస్తున్నారు. రిపేర్ల కోసం కార్మికులు దరఖాస్తులు ఇస్తే నెలల తరబడి ఆలస్యం చేస్తున్నారు. కాలం చెల్లిన క్వార్టర్లను కార్మికులకు కేటాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నా, కంపెనీ అధికారులు కనీసం వీటిని సకాలంలో రిపేర్లు చేయడం లేదు. దీంతో కార్మిక కుటుంబాలు తీవ్ర అవస్థలు పడుతున్నాయి. కంపెనీ పెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్‌లో 7147క్వార్టర్లు ఉన్నాయి. వీటిలో షిర్కే క్వార్టర్లు మినహా మిగిలిన గ్రౌండ్ ఫ్లోర్ క్వార్టర్లు సుమారు 35ఏళ్ల క్రితం నిర్మించారు. ఇక ఆర్కే 5 కాలనీ వంటి బ్యారెక్స్ క్వార్టర్లైతే 45ఏళ్లు అవుతున్నాయి. ఇవన్నీ నేడు శిథిలావస్థకు చేరాయి. వీటిలో నివసించడం భద్రమా కాదా అనేది అధికారులే శాస్త్రీయ ప్రమాణాలు చూపెట్టి నిరూపించుకోవాల్సి ఉంది. వీటినే రిపేర్ల మీద రిపేర్లు చేయిస్తూ కౌన్సెలింగ్‌లో కార్మికులకు కేటాయిస్తున్నారు. నేడు ఈ క్వార్టర్‌లో మూడో తరం కార్మికవర్గం నివాసం ఉంటుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గడిచిన పదేళ్ల నుంచి రిపేర్ల పేరుతో పెట్టిన ఖర్చుతో కొత్తగా క్వార్టర్ కట్టవచ్చని అధికారులే పేర్కొంటున్నారు.

ముట్టుకుంటే ఊడిపోవడమే...

శిథిలావస్థకు చేరిన క్వార్టర్లలో డోర్లు, కిటికీలు ముట్టుకుంటే ఊడిపోతున్నాయి. కొత్తగా క్వార్టర్ అలాట్ అయిన వారు అందులోకి రావడానికి జంకుతున్నారు. రిపేర్ల కోసం దరఖాస్తులు చేసుకొంటే రోజులు, ఒక్కోసారి నెలల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. కాపౌండ్ గోడలు కూలుతున్నాయి. వర్షకాలంలో ఉరుస్తున్నాయి. స్లాబ్‌పైన డాంబర్ షీట్ వేసి వాటర్‌ప్రూఫ్ పనులు చేయించాల్సిన అధికారులు వేసవిలో నిర్ణీత సయమానికి టెండర్లు వేయకపోవడం, ఈ జాప్యంతో పనులు మొదలుపెట్టిన వర్షాలు మొదలు కావడంతో సగంలోనే పనులు ఆగిపోతున్నాయి. కొన్ని క్వార్టర్లు అలాగే ఉరుస్తున్నాయి. పీవీసీ డోర్లు ఫిట్ చేయడానికి కాంట్రాక్టర్ రోజుల తరబడి సమయం తీసుకుంటున్నాడని కార్మికులు వాపోతున్నారు. షిర్కే కాలనీలో పై కప్పు పెచ్చులూడుతున్నాయి. ఎప్పుడు ఏ క్వార్టర్‌లో పెచ్చులూడిపడుతాయో తెలియని భయందోళనలు నెలకొన్నాయి. అప్పటి టెక్నాలజీతో కట్టిన ఈ షిర్కే క్వార్టర్‌ల రూఫ్‌ల జీవిత కాలం ఎంత అనేది దానిపై కంపెనీ శాస్త్రీయంగా రిపోర్టు లేదు. అవి భద్రమా కాదా అని తేల్చాల్సి ఉందని కార్మికులు పేర్కొంటున్నారు.

వర్క్‌షాప్ చుట్టూ ప్రదక్షిణలు..

ఇక క్వార్టర్లలో ఎలక్ట్రికల్ వైరింగ్ అధ్వాన్నంగా ఉంది. బోర్డులు, స్విచ్‌లు చాలా వరకు చెడిపోయాయి. కార్మికులకు వైరింగ్ కోసం దరఖాస్తులు చేసుకొంటే నెలల తరబడి వర్క్‌షాప్ అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఏటా హౌజ్ వైరింగ్ టెండర్‌లో జాప్యం జరగడం, కాంట్రాక్టర్లు సకాలంలో వైరింగ్ చేయకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్క్‌షాప్ అధికారుల నిర్లక్ష్యం కూడా మరింత కారణం అవుతుంది. నాయకులు, పలుకుబడి ఉన్నా వ్యక్తులు చెబితేనే వర్క్‌షాప్ అధికారులు స్పందిస్తారని, లేకుంటే పనులు జాప్యం చేస్తున్నారని కార్మికులు పేర్కొంటున్నారు.

మెరుగుపరుస్తాం

సివిల్ రిపేర్‌వ్యవస్థను మరింత మెరుగుపరుస్తాం. రిపోర్టు వచ్చిన తర్వాత రిపేర్ల కోసం వెళ్తే కొందరు కార్మికులు తర్వాత వచ్చి చేయండి అంటూ తిప్పి పంపిస్తున్నారు. డోర్లు, కిటికీల మరమ్మతులో జాప్యం లేకుండా త్వరగా బిగించేలా చూస్తాం.

– ఆనంద్‌కుమార్, డీజీఎం, సివిల్

ఘనంగా వాల్మీకి జయంతి


బెటాలియన్‌లో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులు


మందమర్రిరూరల్: నివాళులర్పిస్తున్న జీఎం


శ్రీరాంపూర్: నివాళులర్పిస్తున్న జీఎం శ్రీనివాస్

నెన్నెల/మంచిర్యాలరూరల్(హాజీపూర్): నెన్నెల మండల కేంద్రంలోని గంగాధర దేవాలయంలో బోయ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో వాల్మీకి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటం వద్ద పూజలు నిర్వహించారు. గుడిపేట బెటాలియన్‌లో కమాండెంట్ పి.వెంకటరాములు, అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాసు, ఆర్‌ఐలు, ఏఆర్‌ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమిని/రామకృష్ణాపూర్/భీమారం/మంచిర్యాల టౌన్/మందమర్రిరూరల్/శ్రీరాంపూర్/దండేపల్లి: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో ఏరియా జీఎం రాధాకృష్ణ, శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో జీఎం శ్రీనివాస్ వాల్మీకి చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించారు. క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో, మంచిర్యాల కార్పొరేషన్ కార్యాలయంలో, కన్నెపల్లి మండల కేంద్రంలో బోయ(వాల్మీకి) కులస్తులు, గ్రామస్తులు, దండేపల్లిలో వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో, భీమారం అభయాంజనేయ స్వామి ఆలయంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు.

లక్సెట్టిపేట: మహనీయుల ఆశయాలు అందరికీ స్ఫూర్తిదాయకమని మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో భీం వర్ధంతి, వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు నివాళులర్పించారు.

'స్థానిక' ఎన్నికల్లో గెలుపునకు కృషిచేయాలి


నాయకులతో మాట్లాడుతున్న దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: బీఆర్‌ఎస్ తరుపున స్థానిక సంస్థల్లో పోటీ చేసే అభ్యర్థుల గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మంగళవారం హాజీపూర్ మండల బీఆర్‌ఎస్ నాయకులతో ఆయన ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యిందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పోటీకి అనుగుణంగా వృత్తివిద్య కోర్సులు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- జన్నారంలోని ఏటీసీ తనిఖీ


ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

జన్నారం: నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రాల్లో వృత్తి విద్య కోర్సులను అందిస్తున్నట్లు, అధునాతన సాంకేతిక వృత్తి విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. జన్నారం మండల కేంద్రంలో గల అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను మంగళవారం ఆకస్మికంగా సందర్శించి రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా అభ్యర్థులు స్వయం ఉపాధి పొందాలని తెలిపారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి ఇంటర్మీడియట్ కొరకు అదనంగా నిర్మిస్తున్న గదుల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ బండి రాములు, కస్తూరిబా పాఠశాల ప్రత్యేక అధికారి శ్రీవాణి తదితరులున్నారు.

రైస్‌మిల్ తనిఖీ..

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ సమీపంలో గల రామ్–లక్ష్మణ్ రైస్‌మిల్‌ను కలెక్టర్ కుమార్‌దీపక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లుకు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాల పురోగతిని పరిశీలించి, త్వరగా పూర్తిచేయాలన్నారు.

సంక్షిప్త వార్తలు

సీఐటీయూలో పలువురి చేరిక

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ సింగరేణి ఏరియా ఆసుపత్రికి చెందిన పలువురు ఉద్యోగులు మంగళవారం సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి, బ్రాంచి అధ్యక్షుడు వెంకటస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, రాజ్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్, గూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని లక్సెట్టిపేట ఏడీఈ ప్రకార్ తెలిపారు. 33కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

రోడ్డుకిరువైపులా పైపులైన్‌తో ఇబ్బందులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని పాతమంచిర్యాల శ్రీలక్ష్మీనగర్ రోడ్డు నంబర్6లో రోడ్డుకు ఇరువైపులా తాగునీటి పైపులైన్‌ను వేయడం వల్ల ఇరుకుగా ఉన్న రోడ్డు, మరింత ఇరుకుగా మారిందని కాలనీవాసులు మంగళవారం కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొలిశెట్టి కిషన్, శ్రీలక్ష్మీనగర్ కాలనీ అధ్యక్షుడు బిసగాని వేణుగోపాల్ గౌడ్, బాలసాని కరుణాకర్, అఖిల్, చిరంజీవి పాల్గొన్నారు.

వృత్తి కోర్సులకు దరఖాస్తులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించే వృత్తి కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీజీఎం(పర్సనల్) అనిల్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి ఉద్యోగుల, మాజీ ఉద్యోగులు, భూ నిర్వాసితుల కుటుంబాల్లో మహిళలకు ఈ ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, జ్యూట్ బ్యాగ్‌ల తయారీ, కంప్యూటర్(డీసీఏ) కోర్సులు నేర్పించనున్నట్లు, ఆసక్తి గల మహిళలు దరఖాస్తులను 15లోగా సమర్పించాలని కోరారు.

పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు బండి రమేశ్, కేంద్ర కమిటీ నాయకులు పానుగంటి సత్తయ్య, పాగాకు రమేశ్, అన్వేశ్ రెడ్డి, గడ్డం మహిపాల్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అన్ని కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉందన్నారు. చెత్తకుండీలు నిండిపోయాయన్నారు. క్వార్టర్లలో వర్షం వస్తే వర్షపు నీరు బయటికి వెళ్లడం లేదన్నారు. సానిటేషన్ వ్యవస్థ అధ్వానంగా ఉందన్నారు.

నేడు తైక్వాండో పోటీలు

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట పట్టణంలోని పాత భగవతి డిగ్రీ కళాశాలలో అక్టోబర్ 8న బుధవారం తైక్వాండో అండర్ 14, అండర్ 17 బాలబాలికలకు జిల్లా, జోనల్ స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా కుమురం భీం వర్ధంతి

- నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆదివాసీ నాయకులు


పాతమంచిర్యాల: నివాళులర్పిస్తున్న ఐక్యవేదిక నాయకులు


దండేపల్లి: భీం విగ్రహం వద్ద ఆదివాసీ నాయకుల నివాళి


భీమారం: నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకపోడ్ నాయకులు


బెల్లంపల్లిరూరల్: భీం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

భీమారం/చెన్నూర్/పాతమంచిర్యాల/తాండూర్/జన్నారం/దండేపల్లి/బెల్లంపల్లిరూరల్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉమ్మడి ఆదిలాబాద్ ముద్దు బిడ్డ, గోండు బెబ్బులి కుమురం భీం వర్ధంతిని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ, పలు సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నిజాం నిరంకుశ పాలనలో ఆదివాసీలపై జరుగుతున్న దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా జల్, జంగల్, జమీన్ నినాదంతో భూమిపై హక్కులు కల్పించాలనే లక్ష్యంతో పోరాడిన వీరుడు భీం అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు.

- మంచిర్యాల జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం, ప్రజా సంఘాల నాయకులు, డీహెచ్‌పీఎస్ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాళ్ల బండి రాజన్న, ప్రధాన కార్యదర్శి నర్సయ్య, రిటైర్డ్ ఎంఈవో శ్రీరామోజు కొండయ్య, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.
- దండేపల్లి మండలం కుందేల్‌పహాడ్‌లో ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు, భీమారంలో ఆదివాసీ నాయికపోడ్ సంఘం ఆధ్వర్యంలో, తాండూర్ మండల కేంద్రంలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో కుమురం భీం వర్ధంతిని నిర్వహించారు. తాండూర్‌లో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మండి రవీందర్, ప్రధాన కార్యదర్శి యాపల సమ్మయ్య కుమురంభీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- హాజీపూర్ మండలంలోని నాగారం, గఢ్‌పూర్, ర్యాలీ, చిన్నగోపాల్‌పూర్‌లో గిరిజనుల ఆధ్వర్యంలో కుమురం భీం విగ్రహం వద్ద నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ పెంద్రెం సోనేరావు, గిరిజనులు పాల్గొన్నారు.
- జన్నారంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఇందన్‌పల్లి చౌరస్తాలో కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి అజ్మీర లాల్‌కుమార్, ఐఎఫ్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.
- చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు బండి రమేశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.
- బెల్లంపల్లిలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కుమురం భీం చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ ఆవునూరి అంజయ్య, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వేతనాలు అకౌంట్లలో జమచేయాలి

దండేపల్లి: ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయాల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న అటెండర్లకు చెల్లించే వేతనాలను నేరుగా అకౌంట్లలో జమచేయాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ అటెండర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎనగందుల దేవేందర్ డిమాండ్ చేశారు. దండేపల్లిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం తమకు చెల్లించే వేతనాలను ఒకచోట జిల్లా సమాఖ్య, మరోచోట మండల సమాఖ్య, ఇంకోచోట స్థానిక స్వయం సహాయక సంఘాల ద్వారా చెల్లిస్తున్నారని, దీంతో తమకు వేతనాల విషయంలో చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోయారు. అంతేకాకుండా తమకు ఎలాంటి ఉద్యోగ భద్రత లేదన్నారు. ప్రభుత్వం వెంటనే తమకు ఉద్యోగ భద్రత కల్పించి, నెలనెలా చెల్లించే వేతనాలను అకౌంట్లలో జమచేయాలన్నారు.